మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
సంపుటి : 01 | సంచిక : 236 | శుక్రవారం, 31 జూలై 2026 | పేజీలు : 4





# అన్ని శాఖలు అలర్ట్‌గా ఉండాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి డీజీపీ సి.వి.ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్ష పరిస్థితులు, చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్ నుండి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ వీసీ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 24×7 పని చేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో మోహరించి పూర్తి అప్రమత్తంగా ఉంచామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచిస్తూ, "జీరో క్యాజువాలిటీస్" లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రాష్ట్ర డీజీపీ మాట్లాడుతూ జిల్లా పోలీసు అధికారులు తప్పనిసరిగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను అనుసరించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని, అవసరమైన చోట ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేసి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్ లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, వివిధ శాఖలకి చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఎగుమతుల వృద్ధికి కార్యాచరణ

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు.

# 'పెద్ది' ఇకలేరు..

- చికిత్స పొందుతూ మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12:50 గంటలకు మృతి చెందినట్లు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు కార్డియాక్ అరెస్ట్ గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిది సార్లు సీపీఆర్ చేశాక కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్ పై ఉంచి చికిత్స ఆరంభించారు. సుదీర్ఘకాలం స్పృహలో లేకపోవడం వల్ల ఆయనలో నాడీ సంబంధిత స్పందన కనిపించలేదని వైద్యులు తెలిపారు. ఆక్సిజన్ లోపం కారణంగా మెదడుకు నష్టం జరిగినట్లు ఈసీజీ, బ్రెయిన్ ఎంఆర్ఎ, టీసీడీ పరీక్షల్లో సూచనలు కనిపించాయని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి మృత దేహాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా లోని తన స్వగ్రామమైన నల్లబెల్లి కి ఈ ఉదయం తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలియగానే పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆసుపత్రికి చేరుకున్నారు.





# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం..

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి హామీ

**భద్రాద్రి కొత్తగూడెం, మన చౌరాస్తా :** పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆరఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో `లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



# రాష్ట్రంలో వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

## అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా యుగంధర్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్ నియామకం అయ్యారు. గత ఆరు సంవత్సరాలుగా సెక్రెటరీ సేవలు అందిస్తున్నారు. వరంగల్ బ్రాంచ్ లో వర్కింగ్ కమిటీ సభ్యులు గత 14 సంవత్సరాలుగా పని చేస్తున్న యుగంధర్ యాదవ్ సేవలు గుర్తించి మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శంకర్ రావు, జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్ ఆయనను జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు నియామకం చేశారు. యుగేందర్ ఎంపిక పట్ల మజ్దూర్ యూనియన్ నాయకులు రమేష్, వంశీ, కృష్ణ, సురేష్, శ్రీనివాస్, సతీస్, మహేష్, రాకేష్, కనకయ్య, రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.





## జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ

# పునరుద్ధరణకి సహకరిస్తా..

- మహబూబాబాద్ ఎస్పీ శబరిష్
- టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత

**మహబూబాబాద్, మన చౌరాస్తా :** జర్నలిస్టుల దాడుల నివారణ సంబంధించిన కమిటీని త్వరలో పునరుద్ధరణకు సహకరిస్తానని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ యూనియన్ జిల్లా నాయకులు కలసి జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరించాలని వినతి పత్రాన్ని జిల్లా ఎస్పీ డా.శబరీష్ ఐపీఎస్ కి అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ నీ పునరుద్ధరించడానికి కావలసిన విధి విధానాలను సమీక్షించి కమిటీ ఏర్పాటుకు సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిర్రగౌని ఉదయ్ ధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి సతీష్‌చారి పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో రక్త పరీక్షలు నిలిపివేత సరికాదు

## మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో గత వారం రోజులుగా రక్త పరీక్షలు నిలిచిపోయాయని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్ ఆరోపించారు. పరికరాలు పనిచేయకపోవడంతో RBS, RFT, HbA1c వంటి కీలక పరీక్షలను సిబ్బంది నిలిపివేశారని తెలిపారు. వర్షాకాలంలో ల్యాబ్ సేవలు బంద్ కావడం వల్ల పేద రోగులు ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యాధికారులు వెంటనే స్పందించి, పరికరాలకు మరమ్మతులు చేయించి పరీక్షలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్




**హైదరాబాద్, మన చౌరాస్తా :** గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కానీ ప్రాజెక్టులలోని అన్ని పంపులను ఆన్ చేసి, రిజర్వాయర్లను నింపుకోవాలనే సోయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి.. అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు. దాదాపు నిన్న 45-50 వేల క్యూసెక్కుల పవర్ జనరేషన్ పేరు మీద నీళ్లు వదులుతున్నరు.. కానీ ఉన్న రిజర్వాయర్లను నింపాలి.. పంపులు ఆన్ చేయాలనేది మాత్రం విస్మరించారని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కొన్ని పంపులు ఆన్ చేశారు.. మరికొన్ని చేయలేదన్నారు. నీళ్లు వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవాలి కానీ వదలన్నీ బంద్ అయినప్పుడు ఏం చేస్తరని ప్రశ్నించారు. వరదలు వచ్చి జూరాల నిండుతున్నా పంపులు ఆన్ చేయలేదన్నారు. రైతులంతా ధర్నా చేస్తం.. మేమే ఆన్ చేసుకుంటమని ధర్నా చేస్తే నిన్న ఆన్ చేశారు. సరైన సమయంలో స్పందించకపోతే పాలమూరు ఎడారి కాక తప్పదని అధికారులు, ప్రభుత్వానికి హెచ్చరించారు.

# విద్యాసేవకుడికి ఘన వీడ్కోలు





- **వృత్తి శిక్షణ బోధకులు మేకల రాములు పదవీ విరమణ**
- **వేలాది మంది విద్యార్థుల జీవితాలకు వెలుగులు నింపిన ఆదర్శ ఉపాధ్యాయుడు**

**హుజురాబాద్, మన చౌరాస్తా :** నాలుగు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ విద్యారంగంలో అంకిత భావంతో సేవలందించి, వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన వృత్తి శిక్షణ బోధకులు మేకల రాములు ఈ నెల జూలై 31, 2026న ప్రభుత్వ సేవల నుంచి పదవీ విరమణ పొందుతున్నారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆయన విద్యా సేవలు, ఉపాధ్యాయ ఉద్యమాల్లో పోషించిన పాత్ర, నిరాడంబర వ్యక్తిత్వం అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచాయి.

## నాగంపేటలో పుట్టి..

1965 జూలై 8న నాగంపేట గ్రామంలో మేకల పోచయ్య, బక్కమ్మ దంపతులకు జన్మించిన మేకల రాములు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సేవాభావం, చదువుపై ఆసక్తితో ఎదిగారు. నాగంపేటలో ప్రాథమిక విద్య పూర్తి చేసి, జెడ్పీహెచ్ఎస్ నాగంపేటలో పదో తరగతి చదివారు. అనంతరం కరీంనగర్‌లో ఇంటర్మీడియట్, ఎస్.కె.ఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశారు. తర్వాత బీఎడ్, వృత్తి శిక్షణలో ప్రత్యేక అర్హతలు సాధించి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు.

1988లో ప్రారంభమైన ఉద్యోగ ప్రస్థానం

1988 డిసెంబర్ 22న వృత్తి శిక్షణ బోధకులుగా ప్రభుత్వ సేవలో చేరిన ఆయన ముల్కనూర్, మహదేవ్‌పూర్, శనిగరం, హుజురాబాద్ ప్రభుత్వ పాఠశాలల్లో విశేష సేవలందించారు. విద్యార్థుల్లో వృత్తి విద్యపై అవగాహన పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించారు. 2009లో ఆయన సేవలను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది.

## ఉపాధ్యాయ ఉద్యమాల్లో..

విద్యా బోధనతో పాటు ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పీఆర్‌టీయూ సంఘంలో సుదీర్ఘకాలం పనిచేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ బాధ్యతలు నిర్వహించి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర పీఆర్‌టీయూ అసోసియేట్ కార్యదర్శిగా కూడా సేవలందిస్తూ సంఘానికి విశేష సేవలు అందించారు.

## కుటుంబ సహకారమే విజయానికి పునాది



**మేకల రాములు విజయవంతమైన ఉద్యోగ జీవితానికి ఆయన కుటుంబ సభ్యుల సహకారం ఎంతో గొప్పదని సహచరులు పేర్కొంటున్నారు. 1990 మే 19న మమతతో వివాహం జరిగిన అనంతరం ఆమె కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రతి దశలో భర్తకు అండగా నిలిచారు. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన సమయంలో కుటుంబాన్ని చక్కగా చూసుకుంటూ ఆయన విద్యాసేవలకు బలమైన ఆధారంగా నిలిచారు. కుటుంబ విలువలను పిల్లల్లో నాటిన మేకల రాములు దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మేకల శ్రీనివాస్, కోడలు దివ్యభారతి, చిన్న కుమారుడు మేకల శ్రీకర్, కోడలు సంగీత కుటుంబానికి మరింత గౌరవం తీసుకువస్తున్నారు. తల్లిదండ్రులు చూపిన క్రమశిక్షణ, సేవాభావాన్ని వారసత్వంగా స్వీకరించి తమ తమ రంగాల్లో రాణిస్తున్నారు. మనవళ్లు నిపున్ (ధ్రువ), యువాన్, శౌర్యలు తాతయ్యకు ఎంతో ఆప్యాయంగా ఉంటూ కుటుంబంలో ఆనందాన్ని నింపుతున్నారు. ఉద్యోగ బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా కుటుంబ సభ్యులతో సమయం గడపడం, పిల్లలు, మనవళ్లకు మంచి విలువలు నేర్పడం మేకల రాములు ప్రత్యేకతగా చెప్పబడుతోంది. ఆయన సాధించిన ప్రతి విజయానికి భార్య మమతతో పాటు కుమారులు, కోడళ్లు, మనవళ్ల ప్రోత్సాహం కూడా ముఖ్య కారణమని కుటుంబ సభ్యులు, సన్నిహితులు పేర్కొంటున్నారు.**

## విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా..




నిరాడంబర జీవనం, సమయపాలన, నిజాయితీ, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల అపారమైన ప్రేమ, సహచరుల పట్ల ఆత్మీయతతో మేకల రాములు అందరి అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన వద్ద చదివిన అనేక మంది విద్యార్థులు నేడు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత స్థానాల్లో సేవలందిస్తూ తమ గురువును గర్వంగా స్మరించుకుంటున్నారు.

## సేవలకు సలామ్..

పదవీ విరమణ సందర్భంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సహచర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు మేకల రాములు చేసిన సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానిస్తున్నారు. ఉద్యోగానికి మాత్రమే పదవీ విరమణ వర్తిస్తుందని, సమాజ సేవకు కాదని పేర్కొంటూ, ఆయన అనుభవం భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని, ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



### గోదావరి పరివాహకంలో
# అప్రమత్తంగా ఉండండి

- **ముంపు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలి**
- **వర్షా ల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్**


**జగిత్యాల, మన చౌరాస్తా :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా మూసుకుపోకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాగునీటి బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్లు బి. రాజ గౌడ్,బి.ఎస్. లత పాల్గొన్నారు.

# త్వరగా భద్రకాళి బండ్ పనుల పూర్తి

- **అధికారులకు కమిషనర్ ఆదేశాలు**



**వరంగల్, మన చౌరాస్తా :** భద్రకాళి బండ్ పై పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధిలోని భద్రకాళి, వడ్డేపల్లి బండ్‌లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భద్రకాళి బండ్ పై పూర్తి చేసిన పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ త్వరితగతిగా బండ్‌పై మిగిలిపోయిన పెండింగ్ పనులను ఆగస్టులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి బండ్, వడ్డేపల్లి బండ్ పై హార్టికల్చర్‌కు సంబంధించి గ్రీనరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, కమిషనర్ వెంట పర్యవేక్షక ఇంజనీర్ రాజ్ కుమార్, హార్టికల్చర్ అధికారి లక్ష్మిరెడ్డి, డీఈ రాజ్ కుమార్, ఏఈ హరికుమార్ తదితరులు ఉన్నారు.




# లెనిన్ సరికొత్త రికార్డులు

## వంద కోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై `ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బిగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**